‘పది’ విజయానికి పక్కా ప్రణాళిక

- టెన్త్ విద్యార్థులకు ప్రత్యేక తరగతులు
- ఉదయం, సాయంత్రం సబ్జెక్టుల వారీగా బోధన
- నూరు శాతం ఉత్తీర్ణత లక్ష్యం
- ఏప్రిల్ 3 నుంచి పబ్లిక్ పరీక్షలు



పత్తికొండ ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో రివిజన్ టెస్ట్ రాస్తున్న పదో తరగతి విద్యార్థులు

పత్తికొండ నియోజకవర్గంలో పదో తరగతి విద్యార్థులు

మండలం	పాఠశాలలు	బాలురు	బాలికలు	మొత్తం విద్యార్థులు
పత్తికొండ	10	443	395	838
తుగ్గలి	11	328	243	571
క్రిష్ణగిరి	10	364	273	637
మద్దికెర	8	207	218	425
వెల్దుర్తి	16	463	427	890
మొత్తం	55	1,805	1,556	3,361

పత్తికొండటౌన్/గోనెగండ్ల: ప్రతి విద్యార్థి జీవితంలో పదో తరగతి కీలకం. పది పరీక్షలలో సాధించిన మార్కులు ఏ విద్యార్థి ఉన్నత విద్యకైనా తొలి మెట్టు. పదో తరగతి పబ్లిక్ పరీక్షలలో నూరు శాతం ఉత్తీర్ణత లక్ష్యంగా విద్యాశాఖ ప్రణాళికలు అమలు చేస్తోంది. ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో పదో తరగతి విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తూ, ప్రణాళికాబద్ధంగా చదివిస్తున్నారు. ఈ ఏడాది ఏప్రిల్ 3 నుంచి 18వ తేదీ వరకు పదవ తరగతి పబ్లిక్ పరీక్షలు జరుగనున్నాయి. గతంలో 11 పేపర్లు ఉండేవి, ఈ ఏడాది నుంచి వాటిని 6 పేపర్లకు కుదించారు. పరీక్ష ఒక్కో పేపరుకు 100 మార్కులు. కాలవ్యవధి 3గంటల 15 నిమిషాలుగా నిర్ణయించారు.

ప్రత్యేక తరగతులు

పబ్లిక్ పరీక్షలకు సన్నాహంలో భాగంగా విద్యార్థులకు ప్రతిరోజు సాయంత్రం 4 నుంచి 5.30 గంటల వరకు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నారు. సెలవు రోజుల్లో కూడా ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నారు. కరోనా ప్రభావం వల్ల గతేడాది పదో తరగతి పరీక్షా ఫలితాలు అంతంత మాత్రంగానే వచ్చాయి. ఈ విద్యా సంవత్సరం సక్రమంగానే సాగింది. పబ్లిక్ పరీక్షలలో ఉత్తమ ఫలితాలు సాధించేందుకు ఉపాధ్యాయులు, విద్యార్థులు సన్నద్ధం అవుతున్నారు. అన్ని సబ్జెక్టులపై రోజువారీగా పరీక్షలు నిర్వహిస్తున్నారు. మెరుగైన ఫలితాల సాధనకు జిల్లా విద్యాశాఖాధికారులు చర్యలు చేపట్టారు. డీఈఓ, ఎంఈఓ, హెచ్ఎంలు తరగతులను పర్యవేక్షిస్తున్నారు. పత్తికొండ నియోజకవర్గంలోని 5 మండలాల్లోని 55 ఉన్నత పాఠశాలల్లో చదువుతున్న 3,361 మంది విద్యార్థులు ఈ ఏడాది పదో తరగతి పబ్లిక్ పరీక్షలు రాయనున్నారు. పరీక్షల సమయంలో విద్యార్థులు ఒత్తిడికి గురికాకుండా మాక్ టెస్టులు నిర్వహిస్తున్నారు. అన్ని సబ్జెక్టుల సిలబస్ పూర్తిచేయడంతో పాటు రివిజన్ టెస్టులు నిర్వహించారు. సిలబస్ పునఃశ్చరణ చేస్తున్నారు. వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుని చదివిస్తున్నారు. అలాగే గోనెగండ్ల మండలంలో 7 హైస్కూళ్లతో పాటు ఏపీ మోడల్ స్కూల్, కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాలలు ఉన్నాయి. ఆయా పాఠశాలల్లో పదో తరగతి విద్యార్థులు 603 మంది ఉన్నారు. వంద శాతం ఉత్తీర్ణతే లక్ష్యంగా ముందుకెళ్తున్నామని ఎంఈఓ వినోద్ కుమార్ తెలిపారు.

పరీక్షలంటే భయం పోయింది



ప్రత్యేక తరగతులతో పరీక్షలపై ఆత్మ విశ్వాసం పెరుగుతోంది. ఇప్పటివరకు చదివిన అంశాలు రివిజన్ చేసుకుంటున్నాం. పరీక్షలంటే భయంపోయింది. ఉపాధ్యాయులు సబ్జెక్టుల వారీగా చదివిస్తూ సూచనలు, సలహాలు ఇస్తున్నారు.
– మహాలక్ష్మి, పదో తరగతి, జెడ్పీహెచ్ఎస్, గోనెగండ్ల

కొంచం కష్టపడితే గణితం సులువే



గణితం అంటే విద్యార్థులు భయపడడం సహజం. కొంచెం కష్టపడితే మంచి మార్కులు సాధించడం చాలా సులువు. ప్రతి అంశాన్ని సాధన చేయాలి. సందేహాలుంటే ఉపాధ్యాయులను అడిగి నివృత్తి చేసుకోవాలి. ఏకాగ్రతతో సాధన చేస్తే మంచి ఫలితాలు ఉంటాయి.
– ఉస్మాన్, గణితం ఉపాధ్యాయుడు, గోనెగండ్ల

విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ



పదో తరగతి సిలబస్ పూర్తిచేసి రివిజన్ టెస్టులు నిర్వహిస్తున్నాం. ప్రణాళికాబద్ధంగా విద్యార్థులను చదివిస్తున్నాం. వెనుకబడిన విద్యార్థులను గుర్తించి, వారికి ప్రత్యేక తరగతులు ఏర్పాటు చేసి, పబ్లిక్ పరీక్షలలో వంద శాతం ఉత్తీర్ణత సాధించే లక్ష్యంగా కృషి చేస్తున్నాం.
– ఎం.రంగస్వామి, ఎంఈఓ, మద్దికెర

క్లుప్తంగా

అక్రమంగా చేపలు పట్టడంపై ఫిర్యాదు



ఆస్పరిలో ఎస్ఐ వరప్రసాద్‌కు వినతి పత్రం ఇస్తున్న సీపీఐ నాయకులు

ఆస్పరి: మండలంలోని వెంగాళాయిదొడ్డి ఆయకట్టు చెరువులో అనుమతి లేకుండా కొంతమంది అక్రమంగా చేపలు పడుతున్నారని, వారిపై చర్యలు తీసుకోవాలని బుధవారం ఎస్ఐ వరప్రసాద్‌కు సీపీఐ నాయకులు నాగేంద్రయ్య, విరుపాక్షి, బ్రహ్మయ్య, క్రిష్ణమూర్తి, ఉరుకుందప్ప, రంగన్న, బజారి వినతి పత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆయకట్టులో చెరువులో మైనర్ ఇరిగేషన్ శాఖ అధికారుల అనుమతి లేకుండా కొందరు దౌర్జన్యంగా చేపలు పట్టడమే గాకుండా రైతులను భయపెడుతున్నారన్నారు. వారిపై కేసు నమోదు చేయాలని ఎస్ఐను కోరారు.

క్రికెట్ టోర్నీ విజేత రామళ్లకోట

కృష్ణగిరి: దస్తగిరయ్య స్వామి ఉరుసు సందర్భంగా నిర్వహించిన జిల్లా స్థాయి క్రికెట్ పోటీల్లో వెల్దుర్తి మండలం రామళ్లకోట జట్టు విజేతగా నిలిచింది. ఈ పోటీల్లో 20 జట్లు పాల్గొనగా రామళ్లకోట, కృష్ణగిరి జట్లు ప్రథమ, ద్వితీయ స్థానాల్లో నిలిచినట్లు నిర్వాహకులు దూద్‌బాషా, పీరా బుధవారం తెలిపారు. పోటీల్లో గెలుపొందిన జట్లకు దాతలు ఉమాకాంత్, విజయ్, బాషా వరుసగా రూ.20 వేలు, రూ.10 వేలను అందజేశారు. వెల్దుర్తి హెల్పింగ్ హ్యాండ్స్ సేవా సంస్థ తరపున జట్టు సభ్యులను సన్మానించారు.

మద్దతు ధరకు శనగ కొనుగోళ్లు



కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఏఓ

మద్దికెర: రబీ సీజన్‌లో సాగు చేసిన శనగ దిగుబడులను ప్రభుత్వ మద్దతు ధర క్వింటాలుకు రూ.5,335 ప్రకారం కొనుగోలు చేస్తున్నామని ఏఓ హేమలత వెల్లడించారు. బుధవారం ఆమె స్థానిక రైతు భరోసా కేంద్రంలో శనగ కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఇప్పటివరకు రైతు భరోసా కేంద్రాలలో 650 మంది రైతులు శనగ విక్రయించేందుకు నమోదు చేసుకున్నారన్నారు. రిజిస్ట్రేషన్ చేసుకున్న రైతుల నుంచి క్రమ పద్ధతిలో శనగ కొనుగోలు చేస్తామని చెప్పారు. ఎంపీఈఓ అనూష, వీఏఏలు జాకీర్, రాణి, ఆనంద్ పాల్గొన్నారు.

విస్తృతంగా ప్రచారం



చిగిళిలో ప్రచారం చేస్తున్న దృశ్యం

ఆస్పరి: మండలంలోని చిగిళి, బిణిగేరి, హాలిగేర గ్రామాలలో బుధవారం వైఎస్సార్‌సీపీ పశ్చిమ రాయలసీమ పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి వెన్నపూస రవీంద్రారెడ్డికి మద్దతుగా సర్పంచ్, ఎంపీటీసీలు వెంకటేష్, రాధాకృష్ణ, వైఎస్సార్‌సీపీ నాయకులు విజయ్‌కుమార్, నాయుడు, సోమన్న, మంజునాథ్‌గౌడ్, శ్రీనివాసులు, సుధాకర్, రామాంజినేయులు ప్రచారం నిర్వహించారు. ఆ గ్రామాలలోని ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయులు, సచివాయల సిబ్బంది, పట్టభద్రులను కలిసి ఓటు అభ్యర్థించారు.

పోలింగ్ బూత్‌ల పరిశీలన



నందవరం పోలింగ్‌బూత్‌ను పరిశీలిస్తున్న ఆదోని సబ్ కలెక్టర్ అభిషేక్ కుమార్

నందవరం: పశ్చిమ రాయలసీమ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల కోసం ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాలను ఆదోని సబ్ కలెక్టర్ పరిశీలించారు. బుధవారం నందవరంలోని మండల పరిషత్ ప్రాథమిక (స్పెషల్ స్కూల్) పాఠశాలలో పోలింగ్ బూత్‌లను ఆయన తనిఖీ చేశారు. ఆయన మాట్లాడుతూ.. ఈ నెల 13వ తేదీన జరిగే ఎమ్మెల్సీ ఎన్నికలు పకడ్బందీగా నిర్వహించాలని రెవెన్యూ అధికారులకు సూచించారు. పోలింగ్ కేంద్రాలలో మౌలిక వసతులు ఏర్పాటు చేయాలన్నారు. తహసీల్దార్ నిత్యానందరాజు, ఎంఈఓ సుదర్శన్ రెడ్డి, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

భవనాలను పూర్తి చేయండి

ఆలూరు: మండలంలోని వివిధ గ్రామాల్లో కొనసాగుతున్న సచివాలయ భవనాలను వేగవంతంగా పూర్తి చేయాలని దేవనకొండ ఎంపీడీఓ గౌరీదేవి సంబంధిత కాంట్రాక్టర్లను ఆదేశించారు. ఆమె బుధవారం పల్లెదొడ్డి, కరివేముల తదితర గ్రామాలలో నూతనంగా నిర్మిస్తున్న ఆర్‌బీకే, వైఎస్సార్ హెల్త్ క్లినిక్ కేంద్రాలను తనిఖీ చేశారు. నిర్మాణాల్లో నాణ్యత పాటించాలని, గడువులోగా పూర్తి చేయాలని సూచించారు. ఈఆర్డీ సూర్యనారాయణ, వైఎస్సార్‌సీపీ నాయకులు వెంట ఉన్నారు.

గాలికుంటు నివారణ టీకాలు వేయించాలి

ఎమ్మిగనూరురూరల్: పశువులు, గొర్రెలకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేయించాలని ఆదోని పశుసంవర్ధక శాఖ డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ వెంకటరమణ పేర్కొన్నారు. బుధవారం బనవాసి గ్రామంలో 31వ రౌండ్ గాలికుంట వ్యాధి నివారణ టీకాలపై పశువుల యజమానులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పశువులు, గొర్రెలకు వచ్చే గాలికుంట వ్యాధిపై యజమానులు అప్రమత్తంగా ఉండి టీకాలు వేయించుకోవాలని సూచించారు. మండల పశువైద్యాధికారి డాక్టర్ అశోక్‌కుమార్, వెటర్నరీ అసిస్టెంట్ రంగస్వామి, వైద్య సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

నేడు మండల మీట్

హొళగుంద: స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో గురువారం మండల సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ దాసనాయక్ బుధవారం తెలిపారు. ఎంపీపీ తంబాకు నూర్జహాన్‌బీ అధ్యక్షతన జరిగే ఈ సమావేశంలో మండలంలోని అభివృద్ధి పనులు అజెండాలోని అంశాల గురించి చర్చిస్తామన్నారు. అలాగే ఆయా శాఖల పనితీరుపై సమీక్ష నిర్వహిస్తామన్నారు. ఆయ శాఖల మండల స్థాయి అధికారులు, ప్రజా ప్రతినిధులు సమావేశానికి తప్పక హాజరు కావాలని కోరారు.

నేడు రథోత్సవం

ఆలూరు: పెద్దహోతూరు గ్రామంలో కొలువుదీరిన ఉచ్చీరప్ప తాత, మరకట్టు గ్రామంలో కొలువుదీరిన సులువప్ప తాత రథోత్సవం గురువారం సాయంత్రం 6 గంటలకు వైభవంగా నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ నిర్వాహకులు బుధవారం తెలిపారు. భారీగా తరలివచ్చే భక్తుల సౌకర్యార్థం అన్ని ఏర్పాట్లు చేసినట్లు వారు వెల్లడించారు.

గ్రామాల్లో దేవర సంబరాలు



మాచాపురంలో కోటేశ్వరి మాతకు బోనాలు సమర్పిస్తున్న భక్తులు

నందవరం: డప్పు దరువులు, మేళతాళాల మధ్య గ్రామ దేవర్లు ఘనంగా జరిగాయి. పురవీధుల్లో బారులు తీరిన కుంభోత్సవాలు కనువిందు చేశాయి. మండల పరిధిలోని టి.సోమలగూడూరులో పెద్దమ్మ, మారెమ్మ దేవర జరగగా, మచాపురంలో గ్రామ దేవత కోటేశ్వరి దేవి ఉత్సవం నిర్వహించారు. వేకువజాము నుంచి ఆయా గ్రామాల ప్రజలు అమ్మవార్లకు విశిష్ట పూజలు నిర్వహించారు. సంప్రదాయంలో భాగంగా భోనాలతో నైవేద్య సమర్పణ గావించారు. వేకువజామున బలిదానాలు కానిచ్చి ఉదయం కుంభోత్సవాలు నిర్వహించారు. ఇంటిల్లిపాది నూతన దుస్తులు ధరించి పిండి వంటలతో మొక్కులు తీర్చుకున్నారు. మొక్కుబడిలో భాగంగా టి.సోమలగూడూరులో ఇంటింటికి భోనాలు సమర్పించారు. వైఎస్సార్‌సీపీ సీనియర్ నేత ఎర్రకోట జగన్‌మోహన్‌రెడ్డి టి.సోమలగూడూరులో అమ్మవార్లను దర్శించుకున్నారు. నాయకులు వెంకటేశ్వరరెడ్డి, ముగతి విరుపాక్షిరెడ్డి, పేట శ్రీనివాసరెడ్డి, తిరుమలరెడ్డి, రాఘవేంద్రరెడ్డి, కోటేశ్వరరావు, గాలేన్న తదితరులు పాల్గొన్నారు.

గ్రామ సచివాలయం తనిఖీ

చిప్పగిరి: మండలంలోని గుమ్మనూరు గ్రామ సచివాలయాన్ని బుధవారం ఎంపీడీఓ సుధాకర్ రాజు ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సిబ్బంది సమయపాలన కచ్చితంగా పాటించాలని ఆదేశించారు. విధులలో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ అందేలా కృషి చేయాలన్నారు. సంక్షేమ పథకాలపై ఆయా శాఖలకు చెందిన అధికారులు అవగాహన కల్పించాలని సూచించారు.

ఘనంగా ఆరాధన

ఆస్పరి: మండలంలోని హలిగేర గ్రామంలో వెలసిన నారాయణ తాత 34వ ఆరాధనోత్సవాలు బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులు నారాయణస్వామి నామ స్మరణంతో తాత రథాన్ని ఊరి చివరి వరకు లాగి తిరిగి ఆలయం వద్దకు చేర్చారు. పెద్దసంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

మెరుగైన ఫలితాలు సాధించాలి

ఎమ్మిగనూరుటౌన్: ప్రస్తుత విద్యా సంవత్సరం పదో తరగతి పరీక్షల్లో అత్యున్నత ఫలితాలు సాధించేందుకు చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ కోటేశ్వరరావు, డీఈఓ రంగారెడ్డి, సర్వశిక్ష ఏపీసీ వేణుగోపాల్ ఆదేశించారు. బుధవారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో ఎంఈఓలు, ఉన్నత పాఠశాలల హెచ్ఎంలు, కేజీబీవీల ప్రిన్సిపాళ్లు జిల్లా ఉన్నతాధికారుల వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్నారు. పది పరీక్షలకు విద్యార్థులను సిద్ధం చేయాలని, మెరుగైన ఫలితాలు సాధించేందుకు చేపట్టాల్సిన చర్యలపై ఉన్నతాధికారులు సూచనలు చేశారు.

ఈఎండీపీతో విద్యార్థుల్లో నైపుణ్యాల వెలికితీత



మాట్లాడుతున్న ఈఎండీపీ జిల్లా మేనేజర్ గోపాల్‌రావ్

వెల్దుర్తి: పాఠశాల దశలోనే విద్యార్థుల్లో దాగిఉన్న విజ్ఞానం, ఆత్మవిశ్వాసం, కమ్యూనికేషన్, సమస్య–పరిష్కారం, సహకారం తదితర నైపుణ్యాల వెలికితీత ఈఎండీపీ (ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ మైండ్‌సెట్ డెవలప్‌మెంట్ ప్రోగ్రాం-వ్యవస్థాపక మనస్తత్వ అభివృద్ధి కార్యక్రమం) ద్వారా సాధ్యపడుతోందని కార్యక్రమ జిల్లా మేనేజర్ గోపాల్‌రావ్ అన్నారు. బుధవారం సూదేపల్లె జెడ్పీ హైస్కూల్‌లో ఈఎండీపీలో భాగంగా ఫెసిలిటేటర్ నాగమణి ఆధ్వర్యంలో 9వ తరగతి విద్యార్థులు పలు సైన్స్ నమూనా ప్రాజెక్టులను ప్రదర్శించారు. రియల్‌ఎస్టేట్, వలసలు, గొర్రెల పెంపకం తదితర ప్రాజెక్టులు వాటి లాభనష్టాలు, సమస్యలకు సమాధానాలు వివరించిన తీరుపై ఆనందం వెలిబుచ్చారు. విద్యార్థులకు తగు సూచనలందించారు. మంచి ప్రాజెక్టులు ప్రదర్శించిన విద్యార్థులకు హెచ్ఎం వరలక్ష్మితో కలిసి బహుమతులు అందజేశారు.

చిరుధాన్యాల ప్రదర్శన



చిరుధాన్యాల ప్రదర్శనను పరిశీలిస్తున్న అధ్యాపక బృందం

ఎమ్మిగనూరురూరల్: మండల పరిధిలోని బనవాసి జవహర్ నవోదయ విద్యాలయంలో అంతర్జాతీయ చిరుధాన్యాల పండుగను పురస్కరించుకొని ప్రధాన మంత్రి పోషణ శక్తి నిర్మాణంలో భాగంగా బుధవారం చిరుధాన్యాల ప్రదర్శన నిర్వహించారు. విద్యాలయ ప్రిన్సిపాల్ కె.సాగరిక మాట్లాడుతూ.. ఆహార అలవాట్లలో చిరుధాన్యాలకు ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. మన పూర్వీకులు మొదట చిరుధాన్యాలనే పండించారని, ప్రతికూల పరిస్థితుల్లో కూడా కొద్దిపాటి వర్షాలకే పంట చేతికి వస్తుందని చెప్పారు. 72 దేశాల మద్దతుతో అంతర్జాతీయ చిరుధాన్యాల పండుగ అమలులోకి వచ్చిందన్నారు. ఆరోగ్యపరమైన ప్రయోజనాలతో పాటు పర్యావరణ పరిరక్షణ పరంగా చిరుధాన్యాలు మేలైనవని పేర్కొన్నారు. వైస్ ప్రిన్సిపాల్ బసవరాజు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆలయ స్థలాలను ఆక్రమిస్తే చర్యలు

మద్దికెర: స్థానిక మద్దమాంబ దేవాలయానికి సంబంధించిన స్థలాలను ఆక్రమిస్తే చర్యలు తీసుకుంటామని నిర్వాహకులు విజయరామరాజు, జంబురాయుడు, రాయుడు అన్నారు. బుధవారం ఆలయానికి సంబంధించిన స్థలాలలో మట్టిని తరలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాబోయే కాలంలో అమ్మవారి ఉత్సవాలకు ఆటంకం కలగకుండా ముందస్తు చర్యల్లో భాగంగా గతంలో ఆక్రమించుకున్న స్థలాలలో ఆలయ అభివృద్ధి పనులు చేపట్టేందుకు కృషి చేస్తున్నామన్నారు. ప్రజలు సహకరించాలని కోరారు.

5 నుంచి ఆపస్ మహాసభలు

ఎమ్మిగనూరుటౌన్: ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘం (ఆపస్) రాష్ట్ర మహాసభలు ఈనెల 5, 6 తేదీల్లో నెల్లూరులో నిర్వహించనున్నట్లు ఆ సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు లక్ష్మీనారాయణ పేర్కొన్నారు. బుధవారం స్థానిక ఎంఆర్సీలో ఎంఈఓ ఆంజినేయులు చేతుల మీదుగా సంఘ నాయకులు రాష్ట్ర మహాసభల పోస్టర్లను ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ విద్యాపరంగా ఉపాధ్యాయ సమస్యలపై మహాసభల్లో చర్చ ఉంటుందన్నారు. సంఘ నాయకులు పాల్గొన్నారు.

పింఛన్ల పండుగ



కర్నూలు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న వెంకటమ్మకు పింఛన్ అందిస్తున్న వెంకటేశ్

ఎమ్మిగనూరురూరల్: ఎమ్మిగనూరు, పత్తికొండ, ఆలూరు నియోజకవర్గాల వ్యాప్తంగా అన్ని గ్రామాల్లో బుధవారం తెల్లవారుజాము నుంచే పింఛన్ల పంపిణీ కార్యక్రమానికి గ్రామ/వార్డు వలంటీర్లు శ్రీకారం చుట్టారు. ఉదయాన్నే లబ్ధిదారుల ఇళ్ల వద్దకు చేరుకొని వేలిముద్రలు నమోదు చేసుకుని పింఛను సొమ్ము అందజేశారు. ఎమ్మిగనూరు మండలంలోని 17 గ్రామ పంచాయతీల్లో 8,663 మంది లబ్ధిదారులకు రూ.2,40,85,000 పంపిణీ చేస్తున్నట్లు ఎంపీడీఓ బంగారమ్మ తెలిపారు. తొలిరోజు 85 శాతం పంపిణీ పూర్తి చేసినట్లు చెప్పారు. వలంటీర్లు ఇళ్ల వద్దకే వచ్చి పింఛన్లు అందచేస్తుండటంతో లబ్ధిదారులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.



కర్నూలులో చికిత్స పొందుతున్న సారంబీకి పింఛన్ పంపిణీ చేస్తున్న వలంటీర్ బగిలి రఫీ

కర్నూలుకు వెళ్లి పింఛన్ పంపిణీ

గోనెగండ్ల: మండల కేంద్రానికి చెందిన వృద్ధురాలు సారంబీ పది రోజుల క్రితం ప్రమాదవశాత్తు కింద పడడంతో కాలు విరిగింది. కుటుంబ సభ్యులు ఆమెను కర్నూలులోని ఓమ్నీ ఆస్పత్రిలో చేర్చి చికిత్స చేయిస్తున్నారు. విషయం తెలుసుకున్న గ్రామ వలంటీర్ బగిలి రఫీ బుధవారం స్థానికంగా పింఛన్ల పంపిణీ పూర్తయిన తర్వాత కర్నూలులోని ఓమ్నీ ఆస్పత్రికి వెళ్లి సారంబీని పరామర్శించి పింఛన్ అందజేశారు. డబ్బు అందుకున్న సారంబీ తనకు బిడ్డ జగన్ పింఛను సొమ్ము పంపించాడని మురిసిపోయారు.

వెల్దుర్తి: కృష్ణాపురంకు చెందిన వృద్ధురాలు వెంకటమ్మ ఇటీవల అనారోగ్యానికి గురై కర్నూలులోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతోంది. విషయం తెలుసుకున్న వలంటీర్ వెంకటేశ్ ఆసుపత్రికి వెళ్లి వెంకటమ్మకు పింఛన్ అందించాడు. వెంకటమ్మ కుటుంబ సభ్యులు ఆనందం వెలిబుచ్చారు.

బైక్ అదుపుతప్పి వ్యక్తి మృతి

ఆలూరు రూరల్: ముద్దనగేరి సమీపంలో బుధవారం రాత్రి 9 గంటలకు జరిగిన రోడ్డు ప్రమాదంలో బాబు (52) అనే వ్యక్తి మృతిచెందాడు. వివరాలు.. బాబు కరిడిగుడ్డం నుంచి స్వగ్రామానికి వెళ్తుండగా బైక్ అదుపుతప్పి కింద పడడంతో తీవ్రగాయాలయ్యాయి. అక్కడున్న వారు 108కు సమాచారం అందించి ఆలూరు ప్రభుత్వ ఆస్పత్రి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. మృతుడు బాబుకు భార్య సరోజమ్మ ముగ్గురు కుమారులు ఉన్నారు.



మృతిచెందిన బాబు

పందుల తరలింపు

మద్దికెర: మండల పరిధిలోని ఎం.అగ్రహారం గ్రామంలో పందులను పట్టుకుని మరో ప్రాంతానికి తరలించినట్లు ఈఓ సంజప్ప తెలిపారు. గ్రామంలో పందులను పెంచడంతో అపరిశుభ్రత ఏర్పడుతోందని, దీనిపై జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదులు అందడంతో ఆయన ఆదేశాల ఆదేశాల మేరకు పందులను పట్టుకుని మరోచోటికి తరలించినట్లు చెప్పారు. అనంతరం పెంపకందారులకు పందుల వల్ల కలిగే నష్టాల గురించి అవగాహన కల్పించారు. ఎవరైనా ప్రజలకు ఇబ్బందులు కలిగించే పనులు చేస్తే చర్యలు తీసుకుంటామన్నారు.

వివాహిత ఆత్మహత్యాయత్నం

పత్తికొండ రూరల్: మండల పరిధిలోని చందోలి గ్రామానికి చెందిన కురువ అనసూయమ్మ అనే వివాహిత బుధవారం ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. పొలానికి వెళ్లిన అనుసూయమ్మ అక్కడే శరీరానికి నిప్పంటించుకుంది. గమనించిన చుట్టు పక్కల రైతులు చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించగా ప్రాణాపాయం నుంచి బయట పడినట్లు వైద్యులు తెలిపారు. భర్త కిష్టప్పతో కలహాలతోనే ఆత్మహత్యకు ఒడిగట్టినట్లుగా తెలుస్తోంది.పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్సీ అభ్యర్థులను గెలిపించాలి



గురుకుల బాలికల పాఠశాల ఉపాధ్యాయులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి

కృష్ణగిరి/వెల్దుర్తి: వైఎస్సార్‌సీపీ పశ్చిమ రాయలసీమ పట్టభద్రుల, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థులైన వెన్నపూస రవీంద్రారెడ్డి, ఎంవీ రామచంద్రారెడ్డిలకు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని పత్తికొండ ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి అభ్యర్థించారు. మండల పరిధిలోని కంబాలపాడు, ఎరుకలచెర్వు, ఆయా గ్రామాల్లోని జిల్లా పరిషత్, కస్తూర్బా, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల, మోడల్ స్కూల్, వెల్దుర్తి మండలంలోని చెరుకులపాడు జెడ్పీ హైస్కూల్, గోవర్ధనగిరి జెడ్పీ హైస్కూల్‌లో ఉపాధ్యాయులను, ఆయా గ్రామాల్లోని సచివాలయ ఉద్యోగులు, పట్టభద్రులను బుధవారం ఆమె కలిసి ఎమ్మెల్సీ ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ అభ్యర్థులను బలపరచాలని కోరారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలన్నింటినీ నెరవేర్చిన ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కిందన్నారు. ఉపాధ్యాయ సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని వివరించారు. గోవర్ధనగిరి గ్రామంలో గోవర్ధనగిరి, శ్రీరంగాపురం, చెర్లకొత్తూరు, పలు మజారా గ్రామాల పట్టభద్రుల ఓటర్లతో సమావేశమై ఓట్లు అభ్యర్థించారు. అనంతరం పార్టీ నాయకులతో మాట్లాడారు. ఈ నెల 13న జరగనున్న ఎమ్మెల్సీ ఎన్నికల్లో పార్టీ బలపరిచిన అభ్యర్థులకు ఓటు వేసేలా గ్రామాల్లో విస్తృతంగా ప్రచారం చేయాలని నాయకులకు దిశానిర్దేశం చేశారు. ఎంపీపీ డాక్టర్ కంగాటి వెంకటరామిరెడ్డి, నాయకులు మాధవరావు, జయరామిరెడ్డి, కృష్ణమూర్తి, సుధాకర్ రెడ్డి, సుంకన్న, రంగనాయకులు తదితరులు ఉన్నారు.

కమనీయం.. మంగమాంబ రథోత్సవం



కరిడిగుడ్డంలో అశేష భక్తజనం మధ్య మంగమాంబ రథోత్సవం నిర్వహిస్తున్న దృశ్యం

ఆలూరు రూరల్: మండలంలోని కరిడిగుడ్డం గ్రామంలో కొలువైన అవధూత మంగమాంగ రథోత్సవం బుధవారం సాయంత్రం కమనీయంగా సాగింది. మంగమాంబకు ఆలయ అర్చకులు శ్రీనివాసులు విశేష పూజలు నిర్వహించారు. భక్తులు భారీ ఎత్తున తరలివచ్చి అమ్మవారికి పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. సాయంత్రం 6.45 నిమిషాలకు అశేష భక్తజనుల నడుమ ఎదురు బసవన్న గుడి వరకు రథాన్ని లాగారు. భక్తులకు ఆలయ కమిటీ నిర్వాహకులు అన్న ప్రసాదాలు పంచిపెట్టారు. ఎస్ఐ నాయక్ బందోబస్తు నిర్వహించారు.

కమ్మరచేడులో మంగమ్మవ్వ రథోత్సవం

ఆలూరు: కమ్మరచేడు గ్రామంలో కొలువైన మంగమ్మ అవ్వ రథోత్సవం బుధవారం కనులపండువగా సాగింది. చుట్టుపక్కల గ్రామాల భక్తులతో పాటు ఆదోని, ఆలూరు మండలాల నుంచి భక్తులు హాజరై ప్రత్యేక పూజలు చేశారు. మార్కెట్ యార్డు చైర్మన్ హరి పుష్పావతమ్మ, సర్పంచ్ సుమతి, నాయకులు మల్లికార్జున రెడ్డి, అనీల్ రెడ్డి, శ్రీధర్ రెడ్డి, ఆయా గ్రామాల ప్రజలు పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు.

భయం వీడి సన్నద్ధం కావాలి



మోడల్ స్కూల్‌లో పదో తరగతి విద్యార్థులకు సూచనలిస్తున్న పీఓ వేణుగోపాల్

కృష్ణగిరి: ప్రతి విద్యార్థి పరీక్షలంటే భయం వీడి ధైర్యంగా సన్నద్ధం కావాలని జిల్లా సమగ్ర శిక్ష పథకం అధికారి డాక్టర్ వేణుగోపాల్ సూచించారు. కృష్ణగిరి మోడల్ స్కూల్‌లో బుధవారం ఆయన కస్తూర్బా, జిల్లా పరిషత్, మోడల్ స్కూల్ పదో తరగతి విద్యార్థులకు పరీక్షలకు సన్నద్ధం కావడంపై పలు సూచనలు చేశారు. పరీక్షల సమయం దగ్గర పడుతుండటంతో విద్యార్థులు ఒత్తిడికి గురికాకుండా ఏకాగ్రతతో చదివితే మంచి ఫలితం వస్తుందన్నారు. రివిజన్ టెస్టుల్లో చేసిన తప్పులు మళ్లీ జరగకుండా చూసుకోవాలన్నారు. సమయాన్ని వృథా చేయకుండా మంచి ఫలితాలు సాధించాలని ఆకాంక్షించారు. విద్యార్థులు బృందంగా కూర్చొని చర్చించుకుంటే జ్ఞాపక శక్తి ఎక్కువగా ఉంటుందని, ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగాలని సూచించారు. చదువుతోపాటు ఆరోగ్యాన్ని కాపాడుకోవాలన్నారు. వంద శాతం ఉత్తీర్ణత సాధించేందుకు కృషి చేయాలని ఉపాధ్యాయులకు సూచించారు. ప్లానింగ్ కో-ఆర్డినేటర్ మారుతి, ప్రిన్సిపాళ్లు నిర్మలాకుమారి, సునీత, హెచ్ఎం వనజాకుమారి, సీఆర్పీలు కృష్ణమూర్తి, వీరనాగప్ప, శ్యామల తదితరులు ఉన్నారు.

రైతులు నమోదు చేసుకోవాలి

ఆలూరు: రబీ సీజన్‌లో సాగుచేసిన శనగ దిగుబడులు విక్రయించాలనుకునే రైతులు స్థానిక రైతు భరోసా కేంద్రాలలో పేర్లు నమోదు చేసుకోవాలని దేవనకొండ ఏఓ సురేష్‌బాబు సూచించారు. మండలంలోని తెర్నేకల్ రైతు భరోసా కేంద్రాన్ని ఆయన బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. శనగ దిగుబడులకు ప్రభుత్వ మద్దతు ధర క్వింటాలుకు రూ.5,335 ప్రకారం కొనుగోలు చేయనున్నట్లు రైతులకు అవగాహన కల్పించాలన్నారు. వీఆర్ఓ బోయ కౌలుట్లయ్య, పంచాయతీ కార్యదర్శి రాముడు, వీఏఏఎస్ సలీం, బాషా తదితరులు ఉన్నారు.

ప్రైవేటు కుళాయి కనెక్షన్ల నిలుపుదల

హొళగుంద: వేసవి కాలం దృష్ట్యా ఇళ్లకు మంచినీటి కొళాయి కనెక్షన్లు నిలుపుదల చేసినట్లు పంచాయతీ సెక్రటరీ రాజశేఖర్ అన్నారు. బుధవారం ఆయన హొళగుందలో విలేకరులతో మాట్లాడుతూ.. వేసవి కాలంలో తాగునీటి ఎద్దడి తలెత్తకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నట్లు చెప్పారు. ఏప్రిల్‌లో తుంగభద్ర దిగువ కాలువ (ఎల్లెల్సీ)లో నీటి సరఫరా నిలిచిపోతుందని, ఎస్ఎస్ ట్యాంకులో నిల్వ ఉన్న నీటితో గ్రామానికి సరి చేస్తామన్నారు. గ్రామానికి సరిపడా ఓవర్‌హెడ్ ట్యాంకులు లేకపోవడంతో ఇబ్బందులు తలెత్తుతున్నాయని పేర్కొన్నారు. ఆయా కాలనీలకు వంతుల వారీగా ఐదు రోజులకోసారి నీటిని సరఫరా చేస్తామని ప్రజలు సహకరించాలని కోరారు. జూలై వరకు ప్రైవేటు కుళాయి కనెక్షన్లు ఇవ్వబోమన్నారు. సర్పంచ్ చలవాది రంగమ్మ సహకారంతో గ్రామస్తులకు తాగునీటి సరఫరాలో ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకుంటున్నామని, ప్రజలు నీటిని పొదుపుగా వాడుకోవాలని కోరారు.

ఎల్లెల్సీ పరిసరాలను కలుషితం చేస్తే చర్యలు

ఎల్లెల్సీ పరిసరాలను, నీటిని కలుషితం చేస్తే చర్యలు తీసుకుంటామని పంచాయతీ సెక్రటరీ రాజశేఖర్ హెచ్చరించారు. బళ్లారి రోడ్డులోని కాలువ గట్టుపై కొందరు చికెన్ షాపుల నిర్వాహకులు వ్యర్థాలను వేయడం వల్ల దుర్వాసన వెదజల్లుతోందన్నారు. నీరు కలుషితమై ప్రజలు అనారోగ్యం పాలవుతున్నారన్నారు. కోళ్ల వ్యర్థాలను చెత్త సేకరణ కేంద్రంలో వేయాలని సూచించారు. బుధవారం ఆ ప్రాంతంలో కోళ్ల వ్యర్థాలను తొలగించి ప్రత్యేక పారిశుద్ధ్య పనులు చేయించారు.